క్లుప్తంగా

ఏన్కూరు ఎస్సైగా రఫీ


ఎస్సై రఫీ

ఏన్కూరు: ఏన్కూరు ఎస్సైగా ఎండీ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన బాదావత్ రవి ఖమ్మంకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి రఫీ ఏన్కూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఎం.ఉషాశారద దరఖాస్తులు స్వీకరించారు. పలు శాఖల అధికారులు ప్రజలిచ్చిన సమస్యల దరఖాస్తులను తీసుకున్నారు. పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్‌నాయక్, ఈజీఎస్ ఏపీఓ నాగరాజు, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ హీరో షోరూం ప్రారంభం


హీరో షోరూంను ప్రారంభిస్తున్న మనీష్‌జైన్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని వసంతనగర్‌లో శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్స్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన హీరో షోరూంను తెలంగాణ ఏరియా మేనేజర్ మనీష్‌జైన్, దీపక్‌కుమార్ రాజ్‌పుత్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా షోరూంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఎండీ ఈశ్వరప్రగడ ఉషారాణి, రంగనాథ్, హైకోర్టు న్యాయవాది ఈశ్వరప్రగడ హరిబాబుతో పాటు చింతలపాటి వెంకటేశ్వరరావు, కొత్తూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ షోరూం..


వాహనదారులకు తాళాలు అందజేస్తున్న మట్టా దయానంద్, నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని స్వామి వివేకానంద విగ్రహం సమీపాన ఎం.డీ.రెహమత్‌పాషా, కమల్‌పాషా, షాకీర్ నేతృత్వాన ఏర్పాటుచేసిన కమల్‌మిత్ర బజాజ్‌షోరూంను కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురికి నూతన వాహనాలు అందచేశారు. టీజీ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు దోమా ఆనంద్‌బాబు, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, ఎస్.కే.మౌలాలీ పాల్గొన్నారు.

కేసు నమోదు

పెనుబల్లి: మండలంలోని మండాలపాడుకు చెందిన ఇడుపులపాటి రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కోట నాగరాజు, ఆయన తోడల్లుడు ఖుంజునూరి రవి స్థానిక ఎస్సీ కాలనీ వద్ద కూల్ డ్రింక్ షాపులో ఉండగా.. కాలనీకి చెందిన రాంబాబు వచ్చాడు. ఆయన నాగరాజు భార్య విషయమై అసభ్యంగా మాట్లాడుతుండడంతో ఇదేమిటని ప్రశ్నించగా రాంబాబు దూషిస్తూ కూల్‌డ్రింక్ బాటిల్‌తో నాగరాజును పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

ఇరువురు వ్యక్తులపై..

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంకు చెందిన అవులూరి వెంకట్రామిరెడ్డి, రామకోటిరెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యలమద్ది సుధాకర్‌రావు అను వ్యక్తి కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామంలో సీతమ్మకు చెందిన రెండు ఎకరాల మామిడి తోటను గేదెల మేత కోసం కౌలుకు తీసుకున్నాడు. సోమవారం గేదెలను మేత మేపేందుకు మామిడి తోటలోకి వెళ్తుండగా వెంకట్రామిరెడ్డి, రామకోటిరెడ్డి ఇద్దరు వ్యక్తులు సుధాకర్‌రావును అడ్డగించి, తమకు చెప్పకుండా కౌలుకు ఎలా తీసుకున్నావని అసభ్య పదజాలంతో దూషించి కర్రలతో కొట్టి చంపుతామని బెదిరించారు. దీంతో సుధాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

స్టేషన్‌లో కనీస వసతులు కరువు

- సరిపడా షెడ్లులు, బెంచీలు లేవు
- ఎండలోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు
- పార్కింగ్ సౌకర్యంలేక వాహనదారుల అవస్థలు
- తెరుచుకోని మరుగుదొడ్లు, మూత్రశాలలు



వసతులు లేని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్


టికెట్ కౌంటర్ వద్ద దెబ్బతిన్న భవనం శ్లాబు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో వసతులు కొరవడ్డాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత మూడేళ్ల క్రితం రైల్వేశాఖ ఆధునీకరణ పనుల నిమిత్తం రూ.49 కోట్ల రూపాయల మేరకు ఖర్చు చేసినప్పటికీ ప్రయాణీకులకు మాత్రం వసతులు కల్పించడంలో విఫలమైంది. ఆ నిధులతో రైల్వే స్టేషన్‌కు నూతన భవనం, మూడో ప్లాట్‌ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. కానీ.. ప్రయాణికులకు అవసరమైన షెడ్లు నిర్మించలేదు. దీంతో చాలా మంది రైళ్ల కోసం ఎండలోనే నిరీక్షణ చేయాల్సి వస్తుంది.

కనీస వసతులు కరువు..

వెయిటింగ్ రూములు ఎప్పుడూ మూత వేసే ఉంటాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ లేదు. అవీ కూడా మూసేసే ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను పార్క్ చేసుకోవానికి పార్కింగ్ స్టాండ్ లేదు. క్యాటిన్ వసతి కూడా లేకుండా ఉంది. దీనికి తోడూ.. స్టేషన్ భవనంలోని టికెట్ కౌంటర్ వద్ద శ్లాబు దెబ్బతిని వర్షానికి లీకవుతుంది. నాణ్యతా ప్రమాణాలతో స్టేషన్ భవనం నిర్మాణానికి నోచుకోలేదు. దూరప్రాంతాలకు ప్రయాణాలు సాగించే వారు రిజర్వేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హాల్టింగ్ నోచుకోని ఎక్స్‌ప్రెస్ రైళ్లు..

తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి పుణ్యక్షేత్రం ఈ రైల్వేస్టేషన్ నుంచి కేవలం 6 కిమీ దూరంలోనే ఉంది. ఈ పుణ్యక్షేత్రానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకల హాల్టింగ్‌కు నోచుకోవడం లేదు. దశబ్దాలుగా కేవలం కృష్ణా, గోల్కొండ, పాసింజర్ రైళ్లు మాత్రమే ఈ స్టేషన్‌లో ఆగుతున్నాయి. శాతవాహన, మచిలీపట్నం తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలంటూ ప్రయాణికులు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఆ దిశగా పట్టించుకునే వారే లేరు. డిప్యూటీ సీఎం భట్టికి, మంత్రి పొంగులేటికి ఈ విషయమై పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోయారు.


మూత్రశాలకు తాళం వేసిన దృశ్యం

ప్లాట్‌ఫాంలపై షెడ్లు నిర్మించాలి..



రైల్వేస్టేషన్‌లో మూడు ప్లాట్ ఫాంలు ఉన్నాయి. వీటిపై ప్రయాణికులకు సరిపడా షెడ్‌లు నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో రైళ్ళ కోసం ప్రయాణికులు ఎండ, వానల్లో సైతం నిరీక్షించాల్సి వస్తుంది. ప్రయాణికులకు వెయిటింగ్ హాలులో వసతి కల్పించాలి. టాయిలెట్లు నిర్మించినప్పటికీ అవి వినియోగించుకునే పరిస్థితి లేకుండా తాళాలు వేసే ఉంటాయి. అధికారులు ప్రయాణికుల బాగోగులపై దృష్టిపెట్టాలి.

– దేవరకొండ వెంకటరత్నం, ఎర్రుపాలెం

పార్కింగ్ స్టాండ్ ఏర్పాటు చేయాలి..



రైల్వేస్టేషన్‌కు దూరప్రాంతాల నుంచి ప్రయాణికులు ద్విచక్ర వాహనాలతో వస్తున్నారు. వాహనాలను పార్కింగ్ చేయాలంటే ఇబ్బంది పడుతున్నాం. స్టేషన్ సమీపంలో బయటనే ఎండకు ఎండేలా, వానకు తడిసేలా వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్ కోసం స్టాండ్‌ను ఏర్పాటు చేయాలి.

– బండారుపల్లి వెంకటేశ్వరరావు, రేమిడిచర్ల

జాతర ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

కారేపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో నిర్వహించే శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ జాతర ఏర్పాట్లను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతరకు వేలాదిగా భక్తజనం తరలిరానున్నారు. ఇల్లందు నుంచి శ్రీకోటమైసమ్మ జాతర ప్రాంగణం వరకు సుమారు 2కిలో మీటర్ల మేర భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణకు గట్టి బందోబస్తు నిర్వహించనున్నట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. అనంతరం పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు ఏసీపీ తిరుపతిరెడ్డిని సన్మానించారు. అనంతరం ఆలయంలో ఏసీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరివెంట సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్.రాజారాం, ఆలయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి ఉన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు

అక్కాతమ్ముడికి..


తల్లిదండ్రులతో జాహ్నవి, శ్యాంకుమార్

వైరా: ఇంట్లో ఒకరికి మెడిసిన్ రావడాన్ని ఆనందంగా భావించే ఈ రోజుల్లో ఒకే ఏడాది అక్కాతమ్ముడు సీటు సాధించడం విశేషం. వైరా 14వ వార్డుకు చెందిన కంటెపూడి యోహాన్ – కృష్ణవేణికి కుమార్తె, కుమారుడు జాహ్నవి, శ్యాంకుమార్ ఉన్నారు. వీరిలో జాహ్నవి 482 మార్కులు సాధించి కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో, శ్యాం 488 మార్కులతో ఖమ్మం ప్రభుత్వ కాలేజీలో సీటు సాధించాడు. వీరిద్దరు వేర్వేరు సంవత్సరాల్లో ఇంటర్ పూర్తిచేసినా లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకుని నీట్‌కు హాజరయ్యారు. కాగా, యోహాన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, కృష్ణవేణి ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు..


గుర్రాల చంద్రక లక్ష్మి


తాటి దేవేందర్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గుర్రాల చంద్రక లక్ష్మి, తాటి దేవేందర్లు మెడికల్ సీట్లు సాధించినట్లు కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రక లక్ష్మి రాష్ట్రస్థాయిలో 1,815వ ర్యాంకు సాధించి నల్గొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా తాటి దేవేందర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భూపాలపల్లిలో సీటు సాధించటం జరిగిందన్నారు. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి


కలకొడిమలో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న రమేష్

వైరారూరల్/తల్లాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న నిత్యావసర ధరలతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. వైరారూరల్ మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో సంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా వెంపటి రాజా, సహాయ కార్యదర్శిగా నల్లమోతు రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా తల్లాడ మండలం కలకొడిమలో కొమ్మినేని కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మహాసభలో రామేష్ పాల్గొని.. పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీపీఎల్ కార్డు దారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనీ పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కినట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీను. బాజోజు రమణ, తూము సుధాకర్, నల్లమోతు వెంకట నారాయణ, శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, ఆదూరి జీవరత్నం, కొమ్మినేని ఆదినారాయణ, అల్లు యాదామిని, వీరయ్య, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వైరా: పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి సంవత్సరం అవుతున్న నేపథ్యాన సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో యుద్ధం వద్దు.. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడారు. అరబ్ దేశాల్లో అమెరికా జోక్యం వలన 3వ ప్రపంచ యుద్ధ వాతావరణం ఆవరించిందన్నారు. ఇప్పటికే 60వేల మందిని యుద్ధం చంపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం వదిలి శాంతియుత పోరాటం చేయాలన్నారు. సుంకర సుధాకర్, కురుగుంట్ల శ్రీనివాసరావు, షేక్. జమాల్, మండడపు రామారావు, కొంగర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ చర్యలను ఖండించాలి..

ఎర్రుపాలెం: పాలస్తీనాలో మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ చర్యలను ఖండించాలని సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య కోరారు. సోమవారం మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు కళ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చట్టాలు మానవతా పరిస్థితులను పూర్తిగా విస్మరించడంతో ఇజ్రాయిల్ రాజ్య హింస విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, షేక్.నాగుల్ మీరా, మేకల పుల్లయ్య, నాగులవంచ సత్యనారాయణ, పుల్లారావు, షేక్.మహబూసాహెబ్, నాగులవంచ వెంకటరామయ్య, దూదిగం బసవయ్య పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణపై అవగాహన


మేడేపల్లిలో గొత్తికోయలతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ ఉమ

ఏన్కూరు: వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కొత్త మేడేపల్లిలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమ నేతృత్వంలో డిప్యూటీ రేంజర్ శ్రీను అడవులు పరిరక్షణ, వన్యప్రాణులను ఎలా సంరక్షించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లాడ కల్లూరు రేంజ్ సెక్షన్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది స్ట్రైక్ ఫోర్స్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ


వీల్ చైర్ అందజేస్తున్న జక్కంపూడి కిషోర్

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో దివ్యాంగుడికి సోమవారం వీల్‌చైర్ వితరణగా అందజేశారు. జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు జక్కంపూడి కిషోర్ చేతుల మీదుగా వీల్ చైర్ అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామినేని రామప్పారావు, జక్కంపూడి రమేష్, బత్తుల రాందాస్, నాగులు మీరా, లాజర్, ప్రసాద్, పొలు, వేలాద్రి పాల్గొన్నారు.

దొడ్డా కృష్ణయ్య సేవలు చిరస్మరణీయం

తల్లాడ: అన్నారుగూడెంలో 31 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ గూండాల చేతుల్లో దారుణ హత్యకు గురైన దొడ్డా కృష్ణయ్య చిరస్మరణీయుడని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం తల్లాడ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డా కృష్ణయ్య వర్ధంతిలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పని చేసి వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వర్‌రావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

చిత్తలూరి వీరమ్మ మృతి

సత్తుపల్లి: చిత్తలూరి తంబి ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ అధ్యక్షురాలు, పీఆర్టీయూ రాష్ట్ర నేత చిత్తలూరి ప్రసాద్ మాతృమూర్తి చిత్తలూరి వీరమ్మ(81) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, నారాయణవరపు శ్రీనివాస్, అలవాల కరుణాకర్, ఎండీ రియాజుద్దీన్, చల్లగుళ్ల నర్సింహారావు, ఏసురత్నం, పీఎల్ ప్రసాద్, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, తేళ్లూరి ఆడమ్స్, రామకృష్ణ, వన్నెంరెడ్డి సాగర్, జొన్నలగడ్డ రాజు, పింగళి సామేలు పలువురు నివాళులర్పించారు.

ఆకుతోట వెంకయ్య ఆదర్శవాది

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు ఆకుతోట వెంకయ్య ఆదర్శవాది అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రా బాబు అన్నారు. సోమవారం తనికెళ్ల సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆకుతోట వెంకయ్య 19వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. అనంతరం పలువురు నాయకులు స్థానికులు వెంకయ్య చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, పీవీరావు, విష్ణుమూర్తి, యాసా వెంకటేశ్వరరావు, లేడిబోయిన గోపాలరావు, పసుమర్తి శంకరరావు, నాగరాజు, రాములు, రాంబాబు, మంగపతిరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డికి నివాళులర్పించిన ఎంపీ రఘురాంరెడ్డి

తల్లాడ: మండలంలోని రంగాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యరమల వెంకటేశ్వరరెడ్డికి సోమవారం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. వెంకటేశ్వరరెడ్డి దశ దిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాము, సుదాకర్, రమేష్ పాల్గొన్నారు.

మహబూబ్ అలీకి..

కారేపల్లి: కారేపల్లి క్యాబిన్ బజార్‌కు చెందిన సీఐటీయూ సీనియర్ నాయకులు, భవననిర్మాణ మేస్త్రీ మహబూబ్ అలీ(75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కాగా.. సీఐటీయూ మండల కార్యదర్శి కె.నరేందర్, భవన నిర్మాణ అనుబంధ మండల కార్యదర్శి రవి, కార్మికులు అలీ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు, టోనీవీరప్రతాప్, హనీఫ్, గౌసుద్దీన్, మజీద్‌పాషా, షఫీ, శ్రీను తదితరులు ఉన్నారు.

ఎమ్మార్సీ మెసెంజర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రుద్రగిరి


రుద్రగిరి

ఏన్కూరు: తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్సీ మెసెంజర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏన్కూరు మండలం తూతుక్కలింగన్నపేటకు చెందిన చింత నబోయిన రుద్రగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రుద్రగిరి గత పదిహేనేళ్లుగా ఏన్కూరు ఎమ్మార్సీలో మెసెంజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రుద్రగిరి నియమితులయ్యారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

చిత్తూ.. చిత్తూలబొమ్మ.. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ బతుమ్మ సంబురాలను సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మలతో మహిళలు సాంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తరలివచ్చి బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిరూరల్: శ్రీకోదండ రామాలయంలో.. బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కల్లూరురూరల్: వాచ్యానాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో..


సత్తుపల్లిటౌన్: బైపాస్‌రోడ్‌లో..


చింతకాని: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా దేవి, శ్రీస్వర్ణ కవచాలంకృత దేవి, శ్రీఅన్నపూర్ణాదేవి, శ్రీ మహాచండీ దేవి అవతారాల్లో దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి ఇష్టమైన చక్కెర పాయసం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


సత్తుపల్లిటౌన్: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


వైరారూరల్: చండీమాత అవతారంలో..


కొణిజర్ల: బీసీ కాలనీలో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలో హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామికి సుప్రభాత సేవ, పుణ్యాహవచనం, నిత్యహోమం, ముత్యపు పందిరిపై గరుడోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యులు, వికనసాచార్యుల ఆధ్వర్యంలో ఎదుర్కోలు ఉత్సవం ఆధ్యాత్మికంగా నిర్వహించారు.